క్లుప్తంగా

జ్యూట్‌మిల్లు కార్మికులకు బకాయిలు చెల్లించాలి

తగరపువలస: చిట్టివలస జ్యూట్‌మిల్లులో కార్మికులకు రావలసిన బకాయిలను యాజమాన్యం చెల్లించాలని లేబర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కొండపు ఈశ్వరరావు డిమాండ్ చేశా రు. గుజ్జు రామునాయుడు భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండేళ్లుగా 272 మంది కార్మికులకు రూ.2.40 కోట్ల బకాయి లు చెల్లించాల్సి ఉన్నా యాజమాన్యం మొండి వైఖరి వీడటం లేదన్నారు. ఎమ్మెల్యే గంటా, ఆర్‌ఎల్‌సీ స్పందించి కార్మికులకు న్యాయం చేయాలన్నారు.

ఇన్‌స్ట్రుమెంటల్ కీ బోర్డులో గిన్నిస్ వరల్డ్ రికార్డు



ప్రతిభా పురస్కారం అందుకుంటున్న కార్తీక

మధురవాడ: మధురవాడ మల్లయ్యపాలేనికి చెందిన కేవీఎస్‌జీ కృష్ణ, సుగుణల కుమార్తె కలగర్ల కార్తీక మ్యూజిక్‌లో విశేష ప్రతిభ ప్రదర్శించింది. ఇన్‌స్ట్రుమెంటల్ కీ బోర్డు ద్వారా మూడు రకాల సరళీ స్వరాలను 45 సెకండ్లలో ప్లే చేసి అరుదైన గిన్నిస్ వరల్డ్ రికార్డ్‌ను సొంతం చేసుకుంది. పీఎం పాలెంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న కార్తీక గతేడాది డిసెంబర్ 1న నిర్వహించిన ఆన్‌లైన్ పోటీల్లో ప్రతిభ కనబరచి, ఈ రికార్డు సొంతం చేసుకుంది. విజయవాడలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమెకు గిన్నిస్ రికార్డు ధ్రువపత్రం, మెడల్‌ను అందజేశారు.

ఎర్నిమాంబ ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

కొమ్మాది: మంగమారిపేట గ్రామదేవత శ్రీ ఎర్నిమాంబ మహోత్సవాలు వచ్చేనెల 3వ తేదీ నుంచి 8వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవ పోస్టర్‌ను ఎంపీ శ్రీభరత్, ఉత్సవ కమిటీ సభ్యులతో కలసి శనివారం ఆవిష్కరించారు. ఉత్సవ కమిటీ సభ్యుడు గరికిన కింగ్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు ఎంఎఫ్‌సీ నగదు ప్రోత్సాహకాలు



నగదు ప్రోత్సాహకాలు అందుకున్న విద్యార్థులతో ఎంఎఫ్‌సీ బ్రదర్స్

తగరపువలస: ఇటీవల పదో తరగతి పరీక్షలలో అత్యధిక మార్కులు సాధించిన ఎంఎఫ్‌సీ సిబ్బంది పిల్లలకు యాజమాన్యం ఆదిమూల నాగరాజు, సత్యనారాయణ శనివారం సాయంత్రం ప్రోత్సాహక నగదు బహుమతులు అందించారు. మండలంలో అత్యధిక మార్కులు సాధించిన ఒక విద్యార్థికి రూ.10వేలు, ఐదుగురు విద్యార్థులకు రూ.5వేలు వంతున, ఆరుగురు విద్యార్థులకు రూ.3వేలు వంతున మొత్తం రూ.53 వేల చెక్కులు, మొమెంటోలు అందించారు.

తునివలసలో వ్యక్తి ఆత్మహత్య



మృతుడు రవీంద్ర కుమార్

పద్మనాభం: జీవితంపై విరక్తితో ఒక వ్యక్తి తునివలసలో ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు అందించిన వివరాలివి.. తగరపువలసకు చెందిన అలుగోలు రవీంద్ర కుమార్ (40)కు పద్మనాభం మండలం తునివలసకు చెందిన పెట్ల వరలక్ష్మితో ఐదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి నాలుగేళ్ల కుమార్తె ఉంది. కొంతకాలం వీరు మధురవాడలో ఉన్న తర్వాత వరలక్ష్మి భర్తతో కలిసి తునివలసలో కన్నవారింటికి వచ్చేసింది. కన్నవారింటిలో వరలక్ష్మి భర్త రవీంద్ర కుమార్‌తో సహా ఉంటుంది. రవీంద్రకుమార్ విజయనగరం మెడికవర్ ఆస్పత్రిలో పని చేస్తున్నాడు. శనివారం వరలక్ష్మి తన తల్లితో కలిపి తునివలసలో తమకున్న టిఫిన్ షాప్ వద్దకు, వరలక్ష్మి తండ్రి కూలి పనికి వెళ్లిపోయారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో మద్యానికి బానిసైన రవీంద్ర కుమార్ జీవితంపై విరక్తి చెంది ఇంట్లోని హాల్లో శ్లాబ్ హుక్‌కు బెడ్ షీట్‌తో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య వరలక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమునిపట్నం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ప్రయాణికులకు నీడ కరువు

అసంపూర్తిగా బస్ షెల్టర్లు
మండుటెండలో ఆరుబయటే నిరీక్షణ



పద్మనాభం జంక్షన్‌లో అసంపూర్తిగా ఉన్న బస్ షెల్టర్

అసలే వేసవి.. నడినెత్తిన నిప్పులు కురిపిస్తున్నట్లుగా భగ్గుమంటున్న భానుడు. ఆ సమయంలో ప్రయాణికులకు నిలువ నీడ లేక ఆరుబయటే నిరీక్షించాల్సిన పరిస్థితి. పద్మనాభం మండలంలోని పలు గ్రామాల్లో బస్‌షెల్టర్లు లేకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. కొన్ని చోట్ల ఉన్నా అవి ఎందుకూ కొరగాకుండా ఉన్నాయి. వైఎస్సార్‌సీపీ హయాంలో రెండు ప్రాంతాల్లో బస్ షెల్టర్ల కోసం నిధులు మంజూరు చేసినా, పనులు జరుగుతున్న సమయంలో ప్రభుత్వం మారడంతో అవి అసంపూర్తిగానే ఉండిపోయాయి. దీంతో ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు.

– పద్మనాభం

చెట్టు కిందే నిరీక్షణ



విజయానందపురం జంక్షన్‌లో బస్సుల కోసం చెట్టు కింద నిరీక్షిస్తున్న ప్రయాణికులు



అసంపూర్తిగా ఉన్న బస్‌షెల్టర్ ముందు పెట్టిన ఫ్లెక్సీ

విజయానందపురం జంక్షన్‌లో గతంలో ఉన్న బస్ షెల్టర్ శిథిలమైంది. దీంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పద్మనాభం, విజయానందపురం జంక్షన్లలో సీఎండీఎఫ్ (చీఫ్ మినిస్టర్ డెవలప్‌మెంట్ ఫండ్స్) రూ.10లక్షల చొప్పున ఒక్కొక్క షెల్టర్ నిర్మాణానికి మంజూరు చేసింది. ఈ నిధులతో శ్లాబ్‌తో పాటు గోడలు నిర్మించారు. ఇంతలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం కోల్పోవడంతో బస్ షెల్టర్ నిర్మాణం పూర్తి కాలేదు. ఇంకా రంగులు వేయాలి. ఫ్లోరింగ్ చేయాలి. కిటికీలు అమర్చాలి. దీనిని అసంపూర్తిగా వదిలేయడంతో జంక్షన్లలో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. విజయానందపురం జంక్షన్‌లో ప్రయాణికులు చెట్ల కింద నిరీక్షిస్తారు. ఇక్కడ ఉన్న అసంపూర్తి బస్ షెల్టర్‌లో ఎండల బారిన పడకుండా ఉండేందుకు బస్సులు వచ్చేంత వరకు ఉందామన్నా ఓ విద్యాసంస్థ షెల్టర్‌కు అడ్డంగా ఫ్లెక్సీ పెట్టడంతో బస్సులు వచ్చేది కూడా తెలియకపోవడంతో జంక్షన్‌లోనే నిరీక్షిస్తున్నారు.

తుప్పలు, చెట్లతో ఇలా..



నరసాపురం జంక్షన్‌లో బస్ షెల్టర్ ముందు ఆవరించిన చెట్లు, తుప్పలు

నరసాపురం బస్ షెల్టర్ ముందు చెట్లు, తుప్పలు ఆవరించి ఉన్నాయి. దీంతో ప్రయాణికులు షెల్టర్‌లోకి వెళ్లే వీలు లేక, రోడ్డుపై నిలబడి బస్సుల కోసం ఎదురు చూడాల్సి వస్తోంది.

షెల్టర్‌లోకి వెళ్లేదెలా?



తునివలస బస్ షెల్టర్‌లో పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలు

తునివలస బస్ షెల్టర్ ద్విచక్ర వాహనాల పార్కింగ్ ప్లేస్‌గా మారింది. షెల్టర్‌లో ద్విచక్ర వాహనాలు పెడుతుండంతో ప్రయాణికులు బస్సుల కోసం రోడ్డుపై నిలబడి ఎండకు ఎండి వానకు తడుస్తున్నారు.

– మద్ది, రెడ్డిపల్లి జంక్షన్లలో బస్ షెల్టర్లు లేక ప్రయాణికులు బస్సుల కోసం మండుటెండలో వేచి ఉండాల్సిన పరిస్థితి.

బైక్ షోరూమ్‌గా ఆర్టీసీ కాంప్లెక్స్



పద్మనాభం జంక్షన్‌లో బైక్ షోరూమ్‌గా మారిన మినీ ఆర్టీసీ కాంప్లెక్సు



పద్మనాభం జంక్షన్‌లో బస్సుల కోసం షిర్డీ సాయిబాబా ఆలయం వద్ద వేచి ఉన్న ప్రయాణికులు

పద్మనాభం జంక్షన్‌లో గతంలో బస్ షెల్టర్ ఉండేది. ఇది చాలా చిన్నది కావడంతో దీనికి ప్రత్యామ్నాయంగా మినీ ఆర్టీసీ కాంప్లెక్స్ నిర్మించారు. ఇది జంక్షన్‌కు దూరంగా ఉండడంతో ఇక్కడికి ప్రయాణికులు వెళ్లలేదన్న నెపంతో రోడ్డు రవాణా సంస్థ దీనిని వాణిజ్య సముదాయంగా మార్చేసింది. మొదట దీన్ని హోటల్ నిర్వహణకు ఇచ్చారు. తర్వాత, సుమారు ఆరేళ్ల నుంచి ఇందులో బైక్ షోరూం నిర్వహిస్తున్నారు. ఇక్కడ సింహాచలం రూట్‌లో బస్సుల కోసం ప్రయాణికులు రోడ్డుపై ఎండలో నిలబడి నిరీక్షించాల్సిన పరిస్థితి. ఇదే జంక్షన్‌లో విజయగనరం వెళ్లే రూటులో ప్రయాణికులు బస్సుల కోసం ఇక్కడ ఉన్న షిర్డీసాయి బాబా ఆలయ సన్నిధిలో వేచి ఉంటారు.

నీడ కోసం ఆలయం వద్ద నిరీక్షిస్తున్నాం



మాది విజయనగరం జిల్లా గజపతినగరం మండలం. పని మీద పద్మనాభం వచ్చాను. తిరిగి గజపతినగరం వెళ్లిపోవడానికి పద్మనాభం జంక్షన్‌లో బస్సుల కోసం ఉన్నాను. బస్ షెల్టర్ పూర్తి కాలేదు. అందులోకి వెళ్లలేక ఎండ ఎక్కువగా ఉండడంతో సమీపంలో ఉన్న ఆలయం వద్ద నిరీక్షిస్తున్నా. బస్సు వస్తే పరుగులు తీయాలి.

– వి.అప్పారావు, దారపాలెం, గజపతినగరం మండలం

చెట్ల కిందే వేచి ఉంటున్నాం



మా జంక్షన్‌లో బస్ షెల్టర్ నిర్మాణం ఆగిపోయింది. దీంతో చెట్ల కిందే వేచి ఉంటున్నాం. మధ్యాహ్నం ఎండ ఎక్కువగా ఉన్నప్పుడు చెట్ల కింద కూడా నీడ ఉండదు. ఆ సమయంలో చాలా ఇబ్బందిగా ఉంటుంది. ప్రభుత్వం స్పందించి బస్ షెల్టర్ నిర్మించేందుకు చర్యలు చేపట్టాలి.

– కె.సింహాచలం, విజయానందపురం

సత్రం భూములు అంగుళం కూడా వదిలిపెట్టం

- భూములు పరిశీలించిన దేవదాయశాఖ అధికారులు
- స్టేటస్ నమోదు

సాక్షి ఎఫెక్ట్..



శ్రీలంగర్‌ఖానా సత్రం భూములు పరిశీలిస్తున్న దేవదాయశాఖ అధికారులు

తగరపువలస: సంగివలస పోలమాంబ ఆలయ ఈవో పరిధిలో ఉన్న శ్రీలంగర్‌ఖానా సత్రం భూములు ఒక్క అంగుళం కూడా ఆక్రమణదారులకు వదిలిపెట్టబోమని దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీధర్ తెలిపారు. చేతులు మారుతున్న శ్రీలంగర్‌ఖానా సత్రం ఆస్తులపై 'సత్రం భూములు పరహస్తం' శీర్షికతో ఈ నెల 25న సాక్షిలో ప్రచురితమైన కథనానికి స్పందించిన దేవదాయశాఖ ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. దీంతో ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ ఆధ్వర్యంలో స్థానిక ఈవో డీవీఎస్ సురేష్‌బాబా, భీమిలి నూకాలమ్మ ఆలయ ఈవో బి.మురళీమోహన్, జూనియర్ సహాయకుడు కోరాడ శ్రీను, అనకాపల్లి నూకాలమ్మ, జ్ఞానాపురం ఎర్నిమాంబ ఆలయాలకు చెందిన జూనియర్ సహాయకులు తాటికొండ రాంబాబు, టీపీవీ ప్రసాద్ తదితరులు లంగర్‌ఖానా భూములు పరిశీలించారు. చిల్లపేట, చిట్టివలస, కుమ్మరిపాలెం, భీమిలి కొంకివీధి, నేరెళ్లవలస పరిధిలోని రామజోగి అగ్రహారం తదితర ప్రాంతాల్లోని సత్రం భూములను పరిశీలించి, స్టేటస్ నమోదు చేశారు. ఇంకా రికార్డులలో ఉన్న మూడు చోట్ల భూములు పరిశీలించవలసి ఉన్నా సమన్వయలోపం, సమయాభావం కారణంగా మరొకరోజు పరిశీలించనున్నట్లు తెలిసింది. ఈ భూముల పరిశీలనలో భాగంగా జీరుపేటకు చెందిన ఆక్రమణదారులు దేవదాయశాఖ అధికారులను బెదిరించినట్లు తెలిసింది. దీనిపై ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ త్వరలో ఆక్రమణలు స్వాధీనం చేసుకోవడానికి నగర పోలీస్ కమిషనర్‌ను ఆశ్రయించనున్నట్లు తెలిపారు. ఉన్నతాధికారుల సమక్షంలో ఆక్రమణల్లో నిర్మాణాలను తొలగిస్తామన్నారు.

సేవలు అవసరమైతే మళ్లీ సిద్ధం

- మాజీ సైనికులు వెల్లడి
- పహల్గాం మృతులకు నివాళులు



అంబేడ్కర్ కూడలిలో నివాళులర్పిస్తున్న మాజీ సైనికులు

తగరపువలస: పాకిస్తాన్‌తో యుద్ధం అవసరమైతే మళ్లీ తాము సిద్ధమని మాజీ సైనికులు తెలిపారు. అంబేడ్కర్ కూడలిలో నిర్వహించిన కార్యక్రమంలో పహల్గాం మృతులకు నివాళులర్పించారు. మాజీ సైనికుల తరఫున శ్రీ చైతన్య అసోసియేషన్, గుడివాడ జై జవాన్ అసోసియేషన్, ఎస్‌ఎస్‌టీ అసోసియేషన్, చిప్పాడ, విష్ణుశ్వర, ఆనందపురం అసోసియేషన్లు పాకిస్తాన్ తీవ్రవాదాన్ని ముక్త కంఠంతో ఖండించారు.



ఉగ్రవాదుల ఫొటోలను దహనం చేస్తున్న వివిధ సంఘాల ప్రతినిధులు

కేజీ రెడ్డి, మ్యాన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రదాడిపై నిరసన ర్యాలీ

భీమునిపట్నం: కాశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడులకు నిరసనగా స్వచ్ఛంద సేవా సంఘాలు, కమిటీలు, రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. నూకాలమ్మ ఆలయం నుంచి బీచ్ లైట్ హౌస్ వరకు ర్యాలీ సాగింది. దాడికి పాల్పడ్డ ఉగ్రవాదుల ఫొటోల ను దహనం చేశారు. సాగర్ అసోసియేషన్ ఆఫ్ వాకర్స్, ఫ్యాబ్, సీనియర్ సిటిజన్స్, మిషన్ గ్రీన్ భీమిలి, హిందు ధర్మ పరిరక్షణ సమితి ప్రతినిధులు నాయకులు మైలపల్లి షణ్ముఖరావు, కాళ్ల సన్నీ, ఎస్.కరుణాకరరెడ్డి, లక్ష్మణరావు పాల్గొన్నారు.

ఆర్చరీ పోటీల విజేత ఒడిశా



విజేతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న టీసీఆర్‌టీఎం ఈడీ రాణి మందా

కొమ్మాది : బిర్సా ముండా 150వ జయంతి సందర్భంగా దేశ వ్యాప్తంగా జరుగుతున్న జన జాతీయ గౌరవ్ వర్ష కార్యక్రమంలో భాగంగా జన జాతీయ ఖేల్ మహోత్సవ్-ట్రైబల్ అర్చరీ మీట్ శనివారం గీతం కళాశాల ప్రాంగణంలో ఘనంగా ముగిశాయి. రెండో రోజు ఆర్చరీ మీట్‌ను రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డి.వి.జి శంకర్రావు పాల్గొని ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని అద్భుతంగా నిర్వహించిన టీసీఆర్‌టీఎం బృందానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ పోటీల్లో ఆంధ్రప్రదేశ్, ఒడిశా, కేరళ, మధ్యప్రదేశ్, రాజస్తాన్, తెలంగాణ, అండమాన్ నికోబార్‌లతో పాటు రాష్ట్రంలోని 8 ఐటీడీఏల నుంచి సీనియర్, జూనియర్ స్థాయిలో గిరిజన క్రీడాకారులు పాల్గొన్నారు. పోటీల్లో ఒడిశాఖ మొదటి స్థానాన్ని కైవసం చేసుకోగా, రెండో స్థానాన్ని తెలంగాణ రాష్ట్రం కైవసం చేసుకుంది. విజేతలకు టీసీఆర్‌టీఎం ఈడీ రాణిమందా సర్టిఫికెట్లను, బహుమతులను అందజేశారు.

మద్యపానం మన ఆలోచనలను చంపేస్తుంది

ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డీసీ శ్రీరామచంద్రమూర్తి



దివీస్ ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడుతున్న శ్రీరామచంద్రమూర్తి

తగరపువలస: మద్యపానం మన ఆలోచనలను చంపేస్తుందని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ నగర డిప్యూటీ కమిషనర్ డి.శ్రీరామచంద్రమూర్తి అన్నారు. భీమిలి మండలం చిప్పాడ దివీస్ లేబరేటరీలో జిల్లా సూపరింటెండెంట్ ఆర్.ప్రసాద్ ఆధ్వర్యంలో 'అవగాహన, ప్రతిస్పందనాత్మక విద్య' అంశంపై శనివారం జరిగిన కార్యక్రమంలో ఉద్యోగులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. మద్యం సంబంధిత సమస్యల గురించి తెలియచేశారు. మద్యం దుర్వినియోగం వలన కలిగే నష్టాలు, పరిణామాల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఎక్సైజ్ కమిషనర్ కె.మహేష్‌కుమార్, సైకో సోషల్ కన్వీనర్ మాధవి, భీమిలి సీఐ పిన్నింటి శ్రీనివాసరావు, దివీస్ జనరల్ మేనేజర్ వైఎస్ కోటేశ్వరరావు, పీ అండ్ ఏ అధికారి శ్రీనివాసరావు, ఎక్సైజ్ అధికారి ఏవీఎస్‌ఎన్ మూర్తి, లైజనింగ్ అధికారి నవీన్, సిబ్బంది పాల్గొన్నారు.

'ఫ్యాబ్' వితరణ

వేర్వేరు ప్రాంతాల్లో 25 బెంచీల ఏర్పాటు



బెంచీలను ప్రారంభించిన సీఐ తిరుమలరావు, ఫ్యాబ్ ప్రతినిధులు

భీమునిపట్నం: భీమిలిలోని ఫ్రెండ్ అసోసియేషన్ ఆఫ్ భీమిలి (ఫ్యాబ్) ప్రజలు సేద తీరేందుకు వీలుగా 25 బెంచీలను వితరణ చేసింది. అందులో భాగంగా కుమ్మరిపాలెం సమీపంలోని ఇండోర్ స్టేడియం వద్ద ఏర్పాటు చేయనున్న రెండు బెంచీలను సీఐ తిరుమలరావు శనివారం సాయంత్రం ప్రారంభించారు. సీఐ మాట్లాడుతూ ఫ్యాబ్ పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు. ఫ్యాబ్ అధ్యక్షుడు కాళ్ల సన్నీ మాట్లాడుతూ సభ్యుల సహకారంతో ఒక్కొక్కటి రూ.ఎనిమిది వేలు విలువ చేసే 25బెంచీలను అవసరమైన ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సభ్యులు ముసునూరి సూర్య శ్రీనివాస్, మారోజు గోపి, దేవానంద్, గుగ్గిళ్ల సాయి, సన్ స్కూల్ డైరెక్టర్ కైతపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కేజీఎస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో..

తగరపువలస: చిట్టివలస నాగవంశం సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు కాళ్ల గురునాయుడు పేరుతో ఏర్పాటైన కేజీఎస్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక గ్రామదేవత పోలమాంబ ఆలయానికి రూ.25వేల విలువైన మూడు సిమెంట్ బెంచీలను బహూకరించారు. ఆలయ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ కాళ్ల శ్రీనివాస్ వీటిని ఆలయ కమిటీ పెద్దలు చిల్ల భాస్కరరెడ్డి, సరగడ నరసింగరావులకు అప్పగించారు. ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

ఇనాం భూముల పట్టాలపై వినతి

తగరపువలస: భీమిలి మండలం నారాయణరాజుపేట పంచాయతీలో ఇనాం భూములకు పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు చేయాలని కోరుతూ స్థానిక రైతులు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు శనివారం ఆయన నివాసంలో వినతిపత్రం అందించారు. గతంలో అనుభవంలో ఉన్న తాము పాస్‌పుస్తకాలు అందజేయాలని కోరుతూ అప్పటి తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చామని, అయితే, వాటికి ఎలాంటి పాస్ పుస్తకాలు మంజూరు చేయలేమని ప్రస్తుత తహసీల్దార్ నోటీసులు జారీ చేశారని పేర్కొన్నారు. క్రయ దస్తావేజులు, అడంగల్, తదితర పత్రాలను వారు ఎమ్మెల్యేకు చూపించారు. రైతుల పట్ల చులకనగా వ్యవహ రిస్తున్న వీఆర్వోను బదిలీ చేయాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలో కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్ల సమావేశంలో రైతుల సమస్యలు తెలియజేస్తానన్నారు. రైతుల వెంట గాడు వెంకటప్పడు, గాడు వెంకట నారాయణ, గాడు తాతినాయుడు, నీలాపు సూర్యనారాయణ ఉన్నారు.


అంగన్‌వాడీలను సందర్శించిన నాగాలాండ్ ఐసీడీఎస్ సిబ్బంది



సామూహిక సీమంతంలో పాల్గొన్న నాగాలాండ్ సిబ్బంది

తగరపువలస: భీమిలి ఐసీడీఎస్ పరిధిలో సుపోషిత్ గ్రామ పంచాయతీగా ఎన్నికైన ఆనందపురం గ్రామ పంచాయతీని నాగాలాండ్‌కు చెందిన ఐసీడీఎస్ సిబ్బంది శనివారం సందర్శించారు. వీరు గర్భిణులు, బాలింతల టీహెచ్‌ఆర్ గురించి అడిగి తెలుసుకున్నారు. పిల్లల బరువు తూచి పోషణ ట్రాకర్ యాప్‌లో సరిపోల్చారు. గృహ సందర్శన ద్వారా బరువు తక్కువగా, పొట్టిగా ఉన్న పిల్లల ఆహార అలవాట్లు అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో అన్నప్రాసన, సామూహిక సీమంతాల కార్యక్రమంలో స్థానికులతో పాల్గొన్నారు. నాగాలాండ్ సీడీపీవో చిర్హోత్సు నైసూయు, సూపర్‌వైజర్ లోచుంబేని, అంగన్‌వాడీలు విషియో ఆయె, తోయోకు సేమా, స్థానిక ఆర్జేడీ జి.చిన్మయి, భీమిలి సీడీపీవో శ్రీదేవి, నోడల్ అధికారి శ్రీకళ, సూపర్ వైజర్లు పీవీవీ రత్నం, సరిత, డీపీవో శ్రీనివాసరావు, సర్పంచ్ చందక లక్ష్మి, సూరిబాబు, ఎంపీటీసీ సభ్యురాలు కొట్యాడ రమాదేవి, రెడ్డిబాబు తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా తయారీ కేంద్రం దగ్ధం



కాలిపోయిన బాణసంచా తయారీ కేంద్రం

తగరపువలస: చెరకుపల్లి అవంతి కళాశాల నుంచి భీమిలి మండలం అన్నవరం రహదారిలో పాత చెరకుపల్లి వద్ద శుక్రవారం రాత్రి ఒంటిగంట సమయంలో బాణసంచా తయారీ కేంద్రం మంటల్లో కాలిపోయింది. ప్రమాదంలో బాణసంచా పేలుళ్లు జరిగి, దగ్గరలో గడ్డివాము దగ్ధమైంది. అనధికారంగా భీమిలి, భోగాపురం మండల సరిహద్దులలో నిర్వహిస్తున్న ఈ తయారీ కేంద్రంలో నాటుకోళ్లు కాలి, బూడిదయ్యాయి. ప్రమాద సమయంలో నిర్వాహకులు పక్కగ్రామంలో ఉన్నట్టు తెలిసింది.సమాచారం అందుకున్న చిట్టివలస అగ్నిమాపక సిబ్బంది, భీమిలి రోడ్‌సేఫ్టీ మొబైల్ సిబ్బంది మంటలను అదుపు చేశారు. ప్రమాద కారణాలను అగ్నిమాపక సిబ్బంది విశ్లేషించగా స్థానికులు ఎవరూ నోరు విప్పడం లేదని తెలిసింది. బాణసంచా తయారీదారుడు సెల్‌ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి దగ్గరకు కూడా రాలేదని తెలిసింది. ప్రమాదం జరిగిన బాణసంచా తయారీ కేంద్రం భోగాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్నందున అక్కడ ఎస్‌ఐ వి.పాపారావును విచారించగా ప్రమాద విషయం తన నోటీస్‌లో లేదన్నారు. వెంటనే సిబ్బందిని పంపించి విచారిస్తామన్నారు.